# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక: 07 | సంపుటి:3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 4-7-2026 | పేజీలు: 8 | వెల: రూ.5.00


**నీలగిరి నిత్యపద్యం**

**ఆటవెలది**

పుస్తకములు చదువు పుష్కలముగ నీవు
మరచిపోదుననుచు మదిన వలదు
పుస్తకమ్ము నీదు మస్తకమ్మునెపుడు
శుద్ధిచేసి మంచి బుద్ధి పెంచు

మీ విజయప్రసాద్
నలుమాసు తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్)
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్‌లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
మండల రిపోర్టర్‌లు
- క్రైమ్ రిపోర్టర్‌లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్‌లు కావలెను.
వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909.





## పాకిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం..
# 40 మంది మృతి..

- పాకిస్థాన్‌లో లోయలో పడిపోయిన ప్రయాణికుల బస్సు
- ప్రమాదంలో కనీసం 40 మంది మృతి, 8 మందికి గాయాలు
- బ్రేకులు ఫెయిల్ కావడం, అధిక ప్రయాణికులే కారణం!
- బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా సరిహద్దుల్లో ఘటన

# గూగుల్ కంటే ఇవే ఎక్కువ సంతోషం కలిగించాయి

- గూగుల్ కంటే కుప్పం ప్రాజెక్టులే ఎక్కువ సంతోషాన్నిచ్చాయని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- కుప్పంలో రూ.9,322 కోట్ల విలువైన 27 పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన
- అడిడాస్ షూస్, విమానాల తయారీ వంటి కీలక కంపెనీలతో వేల ఉద్యోగాలకు అవకాశం
- శంకుస్థాపన రోజే ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించిన పారిశ్రామికవేత్తలు
- దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి హామీ



"గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన చేసిన నాటి కంటే, ఇవాళ జరిగిన కార్యక్రమాలతోనే నాకు ఎక్కువ సంతోషంగా ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పం రూపురేఖలను మార్చే భారీ పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గుడుపల్లె మండలం పొగురుపల్లిలో "స్వర్ణ కుప్పం.. పెట్టుబడుల వేదిక" పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ వేదికపై నుంచి వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించే పలు కీలక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న కుప్పం, ఇప్పుడు అభివృద్ధి కేంద్రంగా


- మిగతా 2వ పేజీలో


## లెక్కలు తప్పితే రాజీనామా చేస్తా..

- మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా?
- తెలంగాణ అప్పులపై చర్చకు తాను సిద్ధమన్న జూపల్లి
- సాయంత్రం 5 గంటలకు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తానన్న మంత్రి
- పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందామని సవాల్







## ప్రశ్నిస్తే చంపేస్తారా? జనసైనికులపై ప్రకాశ్ రాజ్ ఫైర్

- యూట్యూబర్ అరెస్ట్‌పై ప్రకాశ్ రాజ్ ఆగ్రహం
- జనసేన తీరుపై తీవ్ర వ్యాఖ్యలు
- జనసేన కార్యకర్తలు గుండాల్లా ప్రవర్తిస్తున్నారంటూ తీవ్ర విమర్శలు
- వారిపై చర్యలు తీసుకోవాలని పవన్, చంద్రబాబులను ట్యాగ్ చేసిన నటుడు
- యూట్యూబర్ ప్రశ్న రావణ్ అరెస్ట్ వ్యవహారంపై వీడియో విడుదల

## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో సీమ దశ మారిపోతుంది

- సున్నపురాళ్లపల్లి వద్ద జేఎస్‌డబ్ల్యూ గ్రీన్ స్టీల్ ప్లాంట్ పనులకు చంద్రబాబు శ్రీకారం
- సీమ దశాబ్దాల కలను నిజం చేస్తూ చారిత్రాత్మక అడుగు వేశామని వ్యాఖ్య
- ఈ ప్రాజెక్టుతో స్థానిక యువతకు వేలాది ఉద్యోగాలు లభిస్తాయని ధీమా
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీని ప్రగతి పథంలో నిలుపుతామన్న లోకేశ్






## అప్పుల లెక్కల్లో పొంతన లేదు..

మంత్రి చెప్పింది ఒకటి.. సీఎం చెప్పింది మరొకటి

- రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందన్న హరీశ్ రావు
- సంగారెడ్డిలో జరిగిన అవగాహన సదస్సులో ప్రభుత్వ తీరుపై విమర్శలు
- మంత్రి జూపల్లి లేఖ ప్రకారం అప్పు రూ.1.77 లక్షల కోట్లు అని వెల్లడి
- అసెంబ్లీలో సీఎం చెప్పిన అప్పు రూ.3.45 లక్షల కోట్లు అని గుర్తు చేసిన మాజీ మంత్రి
- ప్రభుత్వ పెద్దల లెక్కల్లోనే తేడాలు ఉన్నాయని ఆరోపణ

# బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా?

- అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ భారం తగ్గించిందన్న డిప్యూటీ సీఎం
- సింగరేణిని బీఆర్ఎస్ సంక్షోభంలోకి నెట్టిందని విమర్శ



తెలంగాణ అప్పులపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈసారి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘాటు ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో భారీ అప్పులు చేశారని అన్నారు. అప్పులపై కేసీఆర్, హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని భట్టి మండిపడ్డారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అప్పులు, ఆర్థిక వ్యవహారాలపై వివరాలు వెల్లడించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో మొత్తం రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు భట్టి తెలిపారు. ఇందులో చెల్లించకుండా వదిలేసిన బకాయిలు కూడా ఉన్నాయని చెప్పారు. పదేళ్ల పాలన అబద్ధాల పునాదులపై సాగిందని విమర్శించారు. ఈ భారీ అప్పులపై మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ అప్పుల కారణంగా రెండున్నరేళ్లలో అసలు, వడ్డీలు కలిపి రూ.2,08,061 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని భట్టి చెప్పారు.

## జూలై 9న మషద్‌లో జరగనున్న ఖననం

- అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఖమేనీ
- నాలుగు నెలల తర్వాత ప్రారంభమైన అంత్యక్రియలు
- ఇంతకాలం కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపరిచిన భౌతికకాయం
- వివిధ నగరాల్లో భారీ స్థాయిలో తుది వీడ్కోలు ఏర్పాట్లు




## దేశంలోనే తొలిసారిగా విమానాన్ని ఈ-వేలం.!

- ఫాల్కన్ స్కామ్‌లో ఈడీ కీలక ముందడుగు
- హాకర్ 800ఎక్స్‌పి విమానం రూ.3 కోట్లకు ఈ-వేలం
- బాధితులకు విక్రయ నగదు పంపిణీకి నిర్ణయం
- రూ.792 కోట్ల పోంజీ స్కామ్‌పై దర్యాప్తు కొనసాగుతోంది

## దేశంలోనే తొలిసారిగా విమానాన్ని ఈ-వేలం..!

ఫాల్కన్ పోంజీ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక పురోగతి సాధించింది. దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఈడీ అధికారులు తాము సీజ్ చేసిన ఒక విమానాన్ని ఈ-వేలం (ఇ-ఆక్షన్) ద్వారా విజయవంతంగా విక్రయించారు. హైదరాబాద్ జోనల్ ఈడీ పరిధిలో జరిగిన ఈ వేలం ప్రక్రియ దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**రూ. 3 కోట్లకు హాకర్ 800ఎక్స్‌పీ విమానం విక్రయం**

ఫాల్కన్ స్కామ్‌లో భాగంగా ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్న 'హాకర్ 800ఎక్స్‌పీ' (హాకర్ 800ఎక్స్‌పీ) చార్టర్డ్ విమానాన్ని ఈ-వేలంలో రూ. 3 కోట్లకు విక్రయించారు. అయితే ఈ ప్రైవేట్ విమానం ధర రూ.14 కోట్ల వరకూ ఉంటుందని సమాచారం. అయితే.. జూలై 1న ఎంఎస్‌టీసీ (ఎంఎస్‌టీసీ) సంస్థ ద్వారా ఈడీ ఈ ఆక్షన్ ప్రక్రియను నిర్వహించింది. పీఎంఎల్‌ఏ (పీఎంఎల్‌ఏ) అడ్జుడికేటింగ్ అథారిటీ ముందస్తు అనుమతితోనే అధికారులు ఈ విమానాన్ని వేలానికి ఉంచారు. కాగా, ఈ విక్రయం ద్వారా వచ్చిన రూ. 3 కోట్ల మొత్తాన్ని ఈ స్కామ్‌లో నష్టపోయిన బాధిత పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించనున్నట్లు ఈడీ స్పష్టం చేసింది.

**శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సీజ్**

ఫాల్కన్ పోంజీ కేసులో ప్రధాన నిందితుడైన అమర్‌దీప్ కుమార్‌కు ఈ చార్టర్డ్ విమానం చెందుతుంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా 2025 మార్చి 7న శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో ఈడీ అధికారులు దీనిని అటాచ్ చేసి, స్వాధీనం చేసుకున్నారు.

**రూ. 792 కోట్ల భారీ మోసం**

నకిలీ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ (ఫేక్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్) పేరుతో నిందితులు భారీ మోసానికి తెరలేపారు. అమర్‌దీప్ కుమార్ అండ్ గ్యాంగ్ దాదాపు రూ. 792 కోట్ల మేర బాధితులను నమ్మించి, పెట్టుబడుల పేరుతో మోసం చేసినట్లు ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. ఈ భారీ స్కామ్‌కు సంబంధించి ఈడీ అధికారులు ఇప్పటికే ముగ్గురు కీలక నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరిన్ని ఆస్తుల గుర్తింపు, నిధుల మళ్లింపుపై ప్రస్తుతం లోతైన దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ వర్గాలు వెల్లడించాయి.

## అప్పుల లెక్కల్లో పొంతన లేదు..

రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని, ప్రభుత్వ పెద్దల మధ్యే లెక్కల్లో పొంతన లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన 'ఎస్ఐఆర్'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా తనకు లేఖ రాశారని తెలిపారు. అయితే, ఇదే అంశంపై నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం చేసిన అప్పు రూ. 3,45,294 కోట్లు అని చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఒకే ప్రభుత్వంలోని మంత్రి ఒక లెక్క, ముఖ్యమంత్రి మరో లెక్క చెప్పడం గందరగోళానికి దారితీస్తోందని హరీశ్ రావు అన్నారు. అప్పుల విషయంలో ప్రభుత్వ పెద్దలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ లెక్కల్లో ఏది నిజమో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తా..

తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అప్పులపై అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. "తెలంగాణ అప్పులపై చర్చకు నేను సిద్ధం. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు సాయంత్రం 5 గంటలకు వస్తా. మరి బీఆర్‌ఎస్ నేతలు సిద్ధమేనా?" అంటూ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. "ఖబడ్దార్ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు. పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందాం రండి" అని ధ్వజమెత్తారు. తన లెక్కలు తప్పు అయితే మంత్రి, ఎమ్మెల్యే పదవులకు తక్షణమే రాజీనామా చేస్తానని, మరి వారి లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తారా? బీఆర్‌ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని ఛాలెంజ్ చేశారు. కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్పే లెక్కలు నిజమేనని మీడియా ముందు ఒప్పుకోవాలని అన్నారు. అసెంబ్లీలో రాష్ట్ర అప్పులపై కేటీఆర్, హరీశ్‌రావు ఒక్కొక్కరు ఒక్కో రకమైన అబద్ధపు లెక్కలు చెప్పారని జూపల్లి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రంపై ఏకంగా రూ.8,21,651 కోట్ల అప్పుల భారం మోపారని ఆయన మండిపడ్డారు. కార్పొరేషన్ల ద్వారా దొంగచాటుగా తెచ్చిన అప్పులను వీరు ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు. తాను ఆత్మగౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, వ్యాపారాలు చేసుకుని రాజకీయాల్లోకి వచ్చానని.. పారిపోయే లక్షణం తనకు లేదని, అబద్ధాలు చెప్పే అలవాటు అంతకన్నా లేదని స్పష్టం చేశారు.

## ప్రశ్నిస్తే చంపేస్తారా?
## జనసైనికులపై ప్రకాశ్ రాజ్ ఫైర్

ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్, జనసేన పార్టీ కార్యకర్తల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. యూట్యూబర్ ప్రశాంత్ రావణ్ అరెస్టు వ్యవహారంలో జనసైనికులు వ్యవహరిస్తున్న తీరును తప్పుబడుతూ, "ప్రశ్నించేవాళ్లను చంపేస్తారా ఏంటి? ఇది గుండాయిజం కాదా?" అని నిలదీశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక వీడియో విడుదల చేశారు. జనసేన కార్యకర్తల తీరు రౌడీయిజంలా ఉందని, దీనిపై చర్యలు తీసుకుంటారా? అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను ట్యాగ్ చేస్తూ ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో జనసేన కార్యకర్తలు అతిగా ప్రవర్తిస్తున్నారని, పద్ధతిగా మెలగాలని ప్రకాశ్ రాజ్ హితవు పలికారు. కేసును న్యాయస్థానం చూసుకుంటుందని, దేశం మొత్తం ఈ పరిణామాలను గమనిస్తోందని ఆయన హెచ్చరించారు. పవన్ కల్యాణ్‌పై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో యూట్యూబర్ జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌ను ఏపీ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అరెస్టు అనంతరం ఆయన్ను పిఠాపురానికి తరలించగా, అక్కడ ఒక కేసులో బెయిల్ లభించింది. అయితే, జనసేన కార్యకర్తలు పెట్టిన మరో కేసులో పోలీసులు ఆయన్ను వెంటనే తిరిగి అరెస్టు చేశారు. ఈ క్రమంలో ప్రశాంత్‌ను మచిలీపట్నం తరలించడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలోనే జనసేన కార్యకర్తల తీరును విమర్శిస్తూ ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి.

# గూగుల్ కంటే ఇవే ఎక్కువ సంతోషం కలిగించాయి

(మొదటి పేజీ తరువాయి)

మారుతోందని చంద్రబాబు అన్నారు. మొత్తం రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 27 పరిశ్రమలు కుప్పంలో కొలువుదీరనున్నాయని ప్రకటించారు. ఫుట్‌వేర్ నుంచి విమానాల తయారీ వరకు వివిధ రంగాలకు చెందిన ప్రఖ్యాత కంపెనీలు తమ యూనిట్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ అడిడాస్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌కు సీఎం భూమిపూజ చేశారు. హ్వాసెంగ్ గ్రూప్ ఆధ్వర్యంలో రూ.899 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ పరిశ్రమ ద్వారా ఏకంగా 20,145 మందికి ఉపాధి లభించనుంది. దేశంలోనే తొలి బ్యాటరీ అనోడ్ మెటీరియల్ ప్లాంట్‌కు కుప్పంలో శ్రీకారం చుట్టారు. అథా గ్రూప్ రూ.2,081 కోట్ల భారీ పెట్టుబడితో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుండగా, దీని ద్వారా 2,600 మందికి ఉద్యోగాలు రానున్నాయి. వియేషన్ రంగంలోనూ కుప్పం తనదైన ముద్ర వేయనుంది. పయనీర్ క్లీన్ యాంప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.150 కోట్ల పెట్టుబడితో టూ సీటర్ ట్రైనర్ విమానాల తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. దీనివల్ల 1,400 మందికి ఉపాధి దొరుకుతుంది. వీటితో పాటు ఎంఏఎఫ్ క్లోతింగ్ (గార్మెంట్స్), న్యూట్రి ఫీడ్స్ (చికెన్ ప్రాసెసింగ్), ఫామ్ అమినో అగ్రిటెక్ (కర్కుమిన్ ఎక్స్‌ట్రాక్షన్) వంటి అనేక ఇతర పరిశ్రమల నిర్మాణాలకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.




ఈ సందర్భంగా పరిశ్రమలకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సహకారం అద్భుతంగా ఉందని పారిశ్రామికవేత్తలు ప్రశంసించారు. ప్రభుత్వ ప్రోత్సాహం చూశాక, పనులను మరింత వేగంగా పూర్తి చేయాలనే ఉత్సాహం కలుగుతోందని తెలిపారు. శంకుస్థాపన రోజే ప్రారంభోత్సవ తేదీలను నిర్దేశించుకుని పనిచేయాలని పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించగా, వారు వేదికపై నుంచే తమ ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించడం విశేషం. అనంతరం ఆయా కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించిన సీఎం, వారి ఉత్పత్తులు, పనితీరు గురించి ఆరా తీశారు. ఈ సభలో ప్రసంగించిన చంద్రబాబు, కుప్పం ప్రజలు తనను 8వ సారి ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి దీవెనలే తనకు శ్రీరామరక్ష అని అన్నారు. "నేను ఎక్కడున్నా నా ఆలోచనలు కుప్పం మీదే ఉంటాయి. దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేయాలన్నది నా కోరిక. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి, అందులో కుప్పం ముందుండాలి," అని ఆయన ఆకాంక్షించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన యువతను అందించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. అభివృద్ధిని అడ్డుకునే వారి తోకలు కత్తిరిస్తానని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలతో పాటు, ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం, బీసీ, ఓసీ కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టు, పరిశ్రమల కోసం విద్యుత్ సబ్‌స్టేషన్లు, హెరిటేజ్ గ్రానైట్ స్టోన్ క్లస్టర్ వంటి పలు అభివృద్ధి పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

## జూలై 9న మషద్‌లో జరగనున్న ఖననం

ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ మరణించిన నాలుగు నెలల తర్వాత ఆయన అంత్యక్రియల ప్రక్రియ ప్రారంభమైంది. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఫిబ్రవరి 28న ఆయన కన్నుమూయగా, భద్రతా కారణాల దృష్ట్యా ఇప్పటి వరకు పార్థివ దేహాన్ని కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపరిచారు. తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రావడంతో, వారం రోజుల పాటు సాగే ఈ అంతిమ యాత్ర కోసం ఇరాన్ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. జూలై 9న ఆయన స్వస్థలమైన మషద్‌లో ఖననం నిర్వహించనున్నారు. ఖమేనీ శవపేటిక శుక్రవారం నాటికి టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా ప్రార్థనా సముదాయానికి చేరుకుంది. మూడు రోజుల పాటు ఇక్కడ ప్రజలు, ఉన్నతాధికారులు, సైనిక సిబ్బంది మరియు విదేశీ ప్రతినిధుల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచుతారు. ఆ తర్వాత పవిత్ర నగరం ఖోమ్‌లోనూ, ఇరాక్‌లోని నజాఫ్, కర్బలాల్లోనూ సంతాప కార్యక్రమాలు నిర్వహించి, చివరగా జూలై 9న మషద్‌లోని ఇమామ్ రెజా పుణ్యక్షేత్రంలో అంత్యక్రియలు పూర్తి చేస్తారు. ఈ కార్యక్రమాల్లో కోట్లాది మంది పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇస్లామిక్ సంప్రదాయాల ప్రకారం మరణించిన వారి శవాన్ని 24 గంటలలోపే ఖననం చేయాలి, అలాగే రసాయనాలతో ఎంబామింగ్ చేయడం కూడా నిషేధం. అయితే, ప్రస్తుత యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ అధినేత ఖమేనీ మృతదేహం విషయంలో మినహాయింపు తీసుకున్నారు. ఆయన పార్థివదేహాన్ని, ఆయన కుటుంబ సభ్యుల మృతదేహాలతో పాటు ఫోరెన్సిక్ మార్చురీలోని రిఫ్రిజిరేటెడ్ కోల్డ్ స్టోరేజ్‌లో (ఫ్రీజింగ్) భద్రపరిచారు. యుద్ధం వంటి అత్యవసర సమయాల్లో ఖననం ఆలస్యం కావడానికి షియా ధార్మిక నియమాల్లో ప్రత్యేక మినహాయింపు ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ అంతిమ యాత్ర ద్వారా దేశ ఐక్యతను, శక్తిని ప్రపంచానికి చాటిచెప్పాలని ఇరాన్ భావిస్తోంది. ప్రజలు ఈ యాత్రలో పెద్దఎత్తున తరలిరావాలని అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ పిలుపునిచ్చారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, చైనా, భారత్ సహా పలు దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా ఖమేనీ వారసుడిగా నియమితులైన నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండే అవకాశం ఉంది.

## బీఆర్‌ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా?

అయినప్పటికీ సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. అధిక వడ్డీ అప్పులను రీస్ట్రక్చరింగ్ చేయడం వల్ల వార్షిక వడ్డీ భారం రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గిందని వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సింగరేణిని సంక్షోభంలోకి నెట్టిందని భట్టి ఆరోపించారు. కొత్త కోల్ బ్లాకులు తీసుకురాలేదని విమర్శించారు. బొగ్గు మాయం ఆరోపణలపై ఇప్పటికే సింగరేణి విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. కొత్త కోల్ బ్లాకుల కోసం కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో సీమ దశ మారిపోతుంది

రాయలసీమ ప్రజల దశాబ్దాల కల అయిన కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో మరో చారిత్రాత్మక అడుగు పడిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేశామని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ రూపురేఖలు మారనున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో విజయనగరంలో జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కు పనులను కూడా ప్రారంభించినట్లు పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లి వద్ద 2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ గ్రీన్ స్టీల్ ప్లాంట్, 350 మెగావాట్ల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ ప్లాంట్ పనులకు ఇవాళ సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టడం తెలిసిందే. దీనిపై లోకేశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాయలసీమ ప్రాంతం ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నిలపాలన్న కూటమి ప్రజా ప్రభుత్వ ఉక్కు సంకల్పానికి ఈ స్టీల్ ప్లాంట్ నిదర్శనమని లోకేశ్ అభివర్ణించారు.

## పాకిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం.. 40 మంది మృతి..

పాకిస్థాన్‌లో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రయాణికులతో వెళుతున్న బస్సు అదుపుతప్పి లోతైన లోయలో పడిపోవడంతో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సుల సరిహద్దులోని షెరనీ జిల్లాలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న ఈ ప్రయాణికుల బస్సు, దానా సర్ ప్రాంతంలోని పర్వత రహదారిపై ప్రయాణిస్తుండగా ఉదయం 8 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. బస్సులో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం, బ్రేకులు విఫలం కావడం వల్లే ఈ ఘోరం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదకరమైన మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు ఒక్కసారిగా లోయలోకి దూసుకెళ్లింది. ప్రారంభంలో ఈ బస్సు 36 మంది ప్రయాణికులతో బయలుదేరినప్పటికీ, మార్గమధ్యంలో మొరాయించిన మరో వాహనంలోని ప్రయాణికులను కూడా ఎక్కించుకోవడంతో మొత్తం ప్రయాణికుల సంఖ్య 48కి చేరింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే '1122' అత్యవసర సిబ్బంది, స్థానిక అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## అమరావతి పేరుతో చేస్తున్న అప్పుల భారం చివరకు ప్రజలపైనే పడుతుంది: సజ్జల

రాజధాని అమరావతి అభివృద్ధి పేరుతో కూటమి ప్రభుత్వం భారీ అప్పులు చేస్తోందని... ఈ భారం చివరికి రాష్ట్ర ప్రజల నెత్తినే పడబోతోందని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ధనంతో చేపట్టే ప్రతి ప్రాజెక్టుపై పారదర్శకత ఉండాలని అన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు ప్రధాన ప్రతిపక్షంగా తమకు ఉందని ఆయన స్పష్టం చేశారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు తిరిగి ఇవ్వాల్సిన ప్లాట్లను అభివృద్ధి చేయాల్సి ఉండగా... ప్రభుత్వం మాత్రం రైతులను చివరి ప్రాధాన్యతగా చూస్తోందని ఆరోపించారు. అమరావతిలో ఒక్క చదరపు అడుగు నిర్మాణానికి ఏకంగా రూ.20 వేల వరకు ఖర్చు చేస్తున్నారని... దీనిపై తాము సందేహాలు వ్యక్తం చేస్తే అధికార పక్షం సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సుమారు రూ.47 వేల కోట్ల వరకు అప్పులు తీసుకువచ్చిందని సజ్జల వెల్లడించారు. అంత భారీ నిధులను రాజధాని హంగులకే తగలేయకుండా... మచిలీపట్నం పోర్టు, కొత్త మెడికల్ కళాశాలలు, హంద్రీ-నీవా సుజల స్రవంతి, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ వంటి కీలక పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే రాష్ట్రానికి ఎంతో ప్రయోజనం చేకూరేదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లక్షల కోట్ల అప్పుల్లో మునిగిపోయిందని... ఇలాంటి తరుణంలో రాజధాని కోసం మరో రూ.2 లక్షల కోట్ల అదనపు భారం మోపితే సామాన్యుడి పరిస్థితి ఏమవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో 40 శాతం మంది ప్రజలు ఓటు వేసిన బలమైన పార్టీగా వైసీపీ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తూనే ఉంటుందని చెప్పారు.



## 8వ వార్డులో ప్రజా సమస్యలపై మున్సిపల్ అధికారుల విస్తృత పర్యటన



**ఆమనగల్లు, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ 8వ వార్డులో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ రమేష్ శుక్రవారం విస్తృతంగా పర్యటించి కాలనీ ప్రజల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు వీధి దీపాల ఏర్పాటు, అంగన్వాడీకి సొంత భవనం నిర్మాణం, కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కేటాయింపు, సంచరిస్తున్న పందుల తొలగింపు, చెత్త సమస్య నివారణ, డ్రైనేజీ, సీసీ రోడ్డు, మోరీ పైప్‌లైన్ పనులు త్వరితగతిన చేపట్టాలని అధికారులను కోరారు. అలాగే బీసీ కాలనీ సమీపంలోని ఆమనగల్ చెరువులో చెత్త వేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అధికారులు ప్రతిపాదిత సీసీ రోడ్డు, మోరీ పైప్‌లైన్, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును పరిశీలించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆత్మ కమిటీ చైర్మన్‌గా చెన్నబోయిన రవి నియామకం



**మానకొండూర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మానకొండూర్ నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్‌గా చెన్నబోయిన రవి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన చెన్నబోయిన రవి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ, రైతాంగ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి లక్ష్యంగా ఆత్మ కమిటీలను ఏర్పాటు చేస్తోంది.చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రవిని ఎమ్మెల్యే అభినందిస్తూ, రైతుల అభివృద్ధి కోసం సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

# మహిళా సాధికారతే మోదీ లక్ష్యం: కేంద్రం మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహిళా సాధికారతే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్ తిమ్మాపూర్‌లో సీఎస్సార్ నిధులతో కొనుగోలు చేసిన కుట్టు మిషన్లను మహిళలకు పంపిణీ చేసిన ఆయన, మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు కేంద్రం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. చట్టసభల్లో 33% రిజర్వేషన్లు, నారీ శక్తి వందన్ అధినీయం' కింద పార్లమెంట్, అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రం నిర్ణయించిందని, త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తి కానుందని ఆయన వెల్లడించారు.బండి సంజయ్ మాట్లాడుతూ, పీఎం ఆవాస్ యోజన కింద 4 కోట్ల ఇళ్లు మహిళల పేరిట అందించామని, ఉజ్వల యోజన ద్వారా 11 కోట్ల ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశామని తెలిపారు. ముద్రా యోజనలో 70 శాతం రుణాలు మహిళలకు మంజూరయ్యాయని, మాతృ వందన యోజన, నమో డ్రోన్ దీదీ, మిషన్ శక్తి వంటి పథకాల ద్వారా మహిళల సాధికారతకు కేంద్రం కృషి చేస్తోందని వివరించారు.ఇల్లాలు లేనిదే ఇల్లు గడవదు, మహిళలు లేనిదే సృష్టే లేదు. కుటుంబాన్ని నడిపే శక్తి కలిగిన మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు నేను సైతం వెయ్యికి పైగా కుట్టు మిషన్లు, ఆటోలు అందించాను. మహిళలు విజయవంతంగా నడుపుతూ ఎదుగుతుండటం సంతోషకరం అని ఆయన అన్నారు.

# మూడు ప్రాథమిక సహకార పరపతి సంఘాలకు నూతన పాలకవర్గాలు

**మానకొండూర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మానకొండూర్ నియోజకవర్గంలోని మానకొండూర్, తాడికల్, మెట్‌పల్లి ప్రాథమిక సహకార పరపతి సంఘాలకు కొత్త పాలకవర్గాలను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ముఖ్య కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు.మానకొండూర్ సింగిల్ విండో చైర్మన్‌గా నాగిశెట్టి రాజయ్య, తాడికల్ విండో చైర్మన్‌గా కీసర సంపత్, మెట్‌పల్లి విండో చైర్మన్‌గా గాజుల మహేష్ నియమితులయ్యారు. వీరితో పాటు సంబంధిత డైరెక్టర్లను కూడా ప్రభుత్వం ప్రకటించింది.నూతన పాలకవర్గాలు రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, సహకార రంగ అభివృద్ధి కోసం కృషి చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆకాంక్షించారు. చైర్మన్లు, డైరెక్టర్లకు ఆయన అభినందనలు తెలిపారు.

# ఓటు హక్కు ప్రతి పౌరుడికి ఉన్న వజ్రాయుధం:కూన శ్రీశైలం గౌడ్





**బెజ్జంకి, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి ఉన్న వజ్రాయుధమని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ కూన శ్రీశైలం గౌడ్ పిలుపునిచ్చారు.బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో ఆయన, మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి పాల్గొన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువత, ఇళ్లు మారిన వారు, ఇంకా పేరు నమోదు కానివారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, ఓట్ల తొలగింపుతో అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అర్హుల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగింపునకు గురికాకుండా చూడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, తహశీల్దార్ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు చెట్టి రాజు, అక్కరవేణి పోచయ్య, ముక్కిస రత్నాకర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, బైర సంతోష్, చెప్యాల శ్రీనివాస్ గౌడ్, చెన్నారెడ్డి, రావుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ పార్టీపై కాంగ్రెస్ నేత మహేష్ గౌడ్ తీవ్ర విమర్శలు



**కరీంనగర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రాన్ని ఎనిమిది లక్షల కోట్ల అప్పుల్లో ముంచి దివాళా తీయించిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. కరీంనగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్పొరేషన్ వ్యవస్థల ద్వారా ఇష్టం వచ్చినట్లుగా అప్పులు తెచ్చి ప్రజలపై భారమోపారని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెలకు 60 వేల కోట్ల రూపాయలు వడ్డీగా చెల్లిస్తున్నామని, ఇది గత బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పుల ఫలితమని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షా ఇరవై వేల కోట్ల రూపాయలు గోదావరిలో కలిసిపోయాయని, నేరెళ్ల ఘటనలో ప్రజలను చిత్రహింసలు పెట్టిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని విమర్శించారు. మహేష్ గౌడ్ మాట్లాడుతూ, తమ హయాంలో 70 వేల ఉద్యోగాలు కల్పించామని, రెండు లక్షల రుణమాఫీ చేశామని, ప్రతి నియోజకవర్గంలో మూడు వేలకు పైగా ఇందిరా మైండ్లు నిర్మిస్తున్నామని వివరించారు. పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, అభివృద్ధి--సంక్షేమం సమానంగా కొనసాగుతున్నాయని చెప్పారు. బీజేపీపై కూడా ఆయన మండిపడి, పెట్రోల్--డీజిల్ ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరిచారని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసి వేల ఉద్యోగులను తొలగించారని విమర్శించారు. మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టి గెలవాలని చూస్తున్న బీజేపీకి తెలంగాణలో ప్రజలు గట్టి బుద్ధి చెప్పారని అన్నారు.రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలిచి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ జన్మదిన వేడుకలు




**దేవరకొండ జూలై 03. (నీలగిరి ఎక్స్ ప్రెస్):** దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే బాలు నాయక్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తో పాటు వారి సతీమణి జ్యోతి ప్రసన్న కి, కుమారుడు దేవరన్ నాయక్ గార్లను పుష్పగుచ్చాలతో, శాలువాలతో ఘనంగా సత్కరించి, గజమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపేందుకు విచ్చేసిన "నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత కి, నియోజకవర్గ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు." "ప్రజల ఆశీర్వాదం, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సహకారంతో దేవరకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి గ్రామ అభివృద్ధి, ప్రతి కుటుంబ సంక్షేమమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

# వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ పత్తి విత్తనాల పంపిణీ



**హుస్నాబాద్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో హెచ్‌డీపీఎస్ విధానానికి అనువైన సబ్సిడీ పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా మాట్లాడుతూ, ఎర్ర నేలలకు హెచ్‌డీపీఎస్ విధానం అత్యంత అనుకూలమని, ఎకరాకు ఆరు విత్తన ప్యాకెట్ల వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఒకేసారి కోత నిర్వహించడం వల్ల కూలీ ఖర్చులు తగ్గి రైతులకు లాభాలు చేకూరుతాయని వివరించారు.ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర ప్రభాకర్, సర్పంచ్ జన్నారపు సంపత్, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# భూ ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**హుస్నాబాద్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ స్మశానవాటిక భూమిని కొంతమంది అక్రమంగా కబ్జా చేశారని గ్రామస్తులు ఆరోపించారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని ప్రజల అవసరాల కోసం పరిరక్షించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.గ్రామస్తులు మాట్లాడుతూ, మండల కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న అక్కన్నపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గతంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం పనిచేసిన వారే ఇప్పుడు ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.సర్వే నంబర్ 387/+లో 4 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఇందులో 2 ఎకరాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం, 20 గుంటలు వైకుంఠధామం, 20 గుంటలు నర్సరీ, 20 గుంటలు డంపింగ్ యార్డ్, మరో 20 గుంటలు బొందలగడ్డకు రెవెన్యూ శాఖ కేటాయించిందని గ్రామస్తులు తెలిపారు.ప్రస్తుతం మార్కెట్ విలువ పెరగడంతో సంబంధం లేని వ్యక్తులు ఈ భూమిపై హక్కులు ఉన్నట్లు ప్రచారం చేస్తూ ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ప్రభుత్వ భూమిని వెంటనే రక్షించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ ,బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు



**కరీంనగర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణలో బీజేపీ బలోపేతం అవుతుండటాన్ని ఓర్వలేక కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుని డ్రామాలు ఆడుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ రెండు పార్టీల నాటకాలు 'బిగ్ బాస్' షోను తలపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. కరీంనగర్ 37వ డివిజన్‌లో రూ.77 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేసి, షాషామహల్ ప్రాంతంలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వీబీజీ రామ్ జీ పథకం అమలుపై కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఉపాధి హామీ కింద కేంద్రం దేశవ్యాప్తంగా రూ.8 లక్షల కోట్లు, తెలంగాణలో రూ.39 వేల కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం 10 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలనుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన ఫోన్ ట్యాపింగ్, సింగరేణి బొగ్గు మాయపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు అరెస్టులు జరగకపోవడం కాంగ్రెస్--బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ కారణమని ఆరోపించారు.తాను ఎంపీగా ఎన్నికైనప్పటి నుండి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్రం నుండి రూ.22 వేల కోట్లు తీసుకువచ్చినట్లు వెల్లడించారు.

# గంజాయి అక్రమ రవాణాపై విస్తృత తనిఖీలు




**గన్నేరువరం, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో గంజాయి మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు గుండ్లపల్లి శ రోడ్డు గ్రామంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఎస్సై నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలం, డాగ్ హాండ్లర్ కానిస్టేబుల్ నితిన్, హెచ్‌సీ తిరుపతి, పిసి సాయిప్రేమ్‌లతో కలిసి కిరాణా షాపులు, పాన్ షాపులు, అనుమానిత ఇళ్లలో తనిఖీలు చేపట్టారు.ఎస్సై నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే 100కు కాల్ చేసి పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

## చేనేత సహకార సంఘం ప్రమాణ స్వీకారంలో ముఖ్య అతిథిగా గంగుల కమలాకర్



**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరంలోని కొత్తపల్లి చేనేత పారిశ్రామిక సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేత కార్మికులను ఆదుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, నేత కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు కేసీఆర్ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. సిరిసిల్ల నేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో పండుగల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు అందించే చీరల తయారీ బాధ్యతలను అప్పగించిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం వస్త్రాల టెండర్లను ఇతర రాష్ట్రాలకు అప్పగించడం ద్వారా స్థానిక కార్మికులను ఉపాధి లేకుండా చేస్తున్నదని ఆయన విమర్శించారు. తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే చేనేత కార్మికులను మళ్లీ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ వాసాల రమేష్, సంఘం అధ్యక్షుడు మునిందర్, ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, కార్యదర్శి హనుమాండ్లు, మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పిఆర్సి, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని ఎస్‌జిటియు డిమాండ్



**కరీంనగర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే ప్రకటించాలని, పిఆర్సి నివేదిక తెప్పించి పిఆర్సి అమలు చేయాలని ఎస్‌జిటియు కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఊకంటి విజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గడప శేఖర్ డిమాండ్ చేశారు. విజేందర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే కనీసం మూడు డీఏలను విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయుల నుండి ప్రీమియం కట్ అవుతున్నప్పటికీ హెల్త్ కార్డులు జారీ చేయకపోవడం వల్ల చికిత్సలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇద్దరు ఉద్యోగులు ఉన్నప్పుడు ఒకరికే ప్రీమియం కట్ అయ్యేలా డీడీవోలకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి గడప శేఖర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా అల్పాహారం, మధ్యాహ్న భోజనం అవసరం లేదని, ఇప్పటికే వారు పాఠశాలలో భోజనం రుచి చూస్తున్నారని తెలిపారు. ఆ ఖర్చును పిల్లల భోజన నాణ్యత పెంచేందుకు వినియోగించాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు ఆంజనేయులు, చంద్రారెడ్డి, జలపతి రెడ్డి, శాంతి కిరణ్ పాల్గొన్నారు.

## మెతుకు పెంటప్ప సేవలు మరువలేనివి



**కరీంనగర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పద్మశాలి జిల్లా చేనేత సహకార సంఘం వ్యవస్థాపకుడు, స్వాతంత్ర సమరయోధుడు మెతుకు పెంటప్ప సేవలు మరువలేనివని తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ వాసాల రమేష్ అన్నారు. కరీంనగర్‌లో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం నివాస ప్రాంగణంలో పెంటప్ప వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వాసాల రమేష్ మాట్లాడుతూ, చేనేత కార్మికుల ఉపాధి కోసం కరీంనగర్‌లో సహకార సంఘం ఏర్పాటు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. పద్మనగర్, మార్కండేయ కాలనీ ఏర్పాటు చేసి నిరుపేద కుటుంబాలకు సహాయం చేసినట్లు తెలిపారు. పద్మశాలి సంక్షేమ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి, చేనేత కార్మికుల నివాస స్థలాల కోసం ఆయన చేసిన కృషి విశేషమని కొనియాడారు. పెంటప్ప ఆశయ సాధన కోసం పద్మశాలీలందరూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, ఉపాధ్యక్షుడు స్వర్గం నర్సయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి వోడ్నాల రవీందర్, ప్రచార కార్యదర్శి మార్త ప్రకాష్, వేముల చంద్రశేఖర్, మెతుకు వంశీకృష్ణ, మెతుకు కృష్ణ చైతన్య, మెతుకు రఘువీర్, మెతుకు హరీష్ రాగ్, మెతుకు రిషి, గర్దాస్ సతీష్, అరకాల నాగేందర్ పాల్గొన్నారు.

## ప్రారంభమైన సిసి రోడ్డు నిర్మాణ పనులు



**హుస్నాబాద్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈజీఎస్ పనులలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రత్యేక చొరవతో రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు హుస్నాబాద్ బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ తెలిపారు. స్థానిక సర్పంచ్ వెన్న స్వర్ణలత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెన్న రాజుతో కలిసి పనులు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్ల నిర్మాణం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బత్తుల శ్రీనివాస్, వార్డ్ సభ్యులు అనిత వెంకటలక్ష్మి, కవిత వీరస్వామి, శారద, రజనీకాంత్, గ్రామపంచాయతీ కార్యదర్శి దివ్య, మాజీ సర్పంచ్ బత్తుల మల్లయ్య, బీజేపీ నాయకులు బైరి అరుణ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# డ్రోన్ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు పొడగింపు



**కరీంనగర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డీజే సౌండ్ వినియోగం, డ్రోన్ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 31 వరకు పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. మహిళలు, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మద్యం సేవనంపై నిషేధాన్ని కొనసాగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మద్యం సేవించి వీధుల్లో అసభ్య పదజాలం ఉపయోగించడం ప్రజలకు ఇబ్బందిగా మారిందని, ప్రజల భద్రత కోసం ఈ చర్యలు తీసుకున్నామని వివరించారు. డీజే సౌండ్ వినియోగం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, శబ్ద కాలుష్యం నివారణ కోసం నిషేధాజ్ఞలు విధించామని తెలిపారు. వివిధ కార్యక్రమాల్లో మైక్ వినియోగం అవసరమైతే సంబంధిత ఏసీపీ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా డ్రోన్లు, పారాగ్లైడర్స్, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల వినియోగాన్ని కూడా నిషేధించినట్లు కమిషనర్ తెలిపారు. ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులు వీటిని వినియోగించే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి అని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఐపిసి 188, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జీవో-17 రద్దు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్

**పెద్దపల్లి, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్-17 చిన్న తరహా కాంట్రాక్టర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోందని వెంటనే రద్దు చేయాలని పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకుల విద్యా సంస్థల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులకు కనీసం దుస్తులు, నోట్‌బుక్కులు అందకపోవడం ప్రభుత్వ వైఫల్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. ఆయన భద్రతను కుదించడం, సతీమణి లక్ష్మీ భాయిని ప్రాధాన్యత లేని పోస్టుకు బదిలీ చేయడం రాజకీయ కక్షసాధింపులో భాగమని విమర్శించారు. జీవో-17 అమలుతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 వేల మంది చిన్న కాంట్రాక్టర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న కాంట్రాక్టర్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని జీవో-17ను తక్షణమే రద్దు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం రేవంత్ రెడ్డి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన చేపట్టగా, పోలీసులు జోక్యం చేసుకుని దాసరి ఉషతో పాటు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ



కార్యక్రమంలో బీరం రవి, బండ నిఖిల్, అజీమ్, కన్నం శ్రావణ్, శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు తరలింపును వెనక్కి తీసుకోవాలని బీఎస్పీ డిమాండ్




**హుస్నాబాద్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్‌లో ప్రజలకు అందుబాటులో ఉన్న కోర్టును ఉమ్మాపూర్ గ్రామ సరిహద్దులకు తరలించే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని కోర్టు నాలుగు మండలాల ప్రజలకు సౌకర్యవంతంగా న్యాయసేవలు అందిస్తోందని, గతంలో ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాలను కిషన్‌నగర్ ప్రాంతానికి తరలించడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అదే తరహాలో కోర్టును తరలిస్తే తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఉమ్మాపూర్ ప్రాంతానికి తగినంత బస్సు సౌకర్యం లేకపోవడంతో కేసుల నిమిత్తం వచ్చే సామాన్యులు అదనపు రవాణా ఖర్చు భరించాల్సి వస్తుందని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని, కోర్టు నిర్మాణానికి ఇచ్చిన అనుమతిని జిల్లా కలెక్టర్ రద్దు చేయాలని బీఎస్పీ తరఫున డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు వెలుపల రాజు, మాజీ జిల్లా ఇన్‌చార్జ్ దేగల వెంకటేష్, నాయకులు మారపల్లి సుధాకర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**పెద్దపల్లి, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అర్హత గల బాలికలు వెంటనే సంబంధిత ప్రధానోపాధ్యాయులను సంప్రదించి ప్రవేశం పొందాలని సూచించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న సీట్లు: ధర్మారం ఎంపిహెచ్‌డబ్ల్యూ -- 25, జూలపల్లి బిపిసి -- 12, ముత్తారం (మంథని) సీఈసీ -- 10, ఓదెల ఎంపిసి -- 14, బిపిసి -- 14, పాలకుర్తి ఎంఎల్టీ -- 5, బిపిసి -- 10, రామగిరి కంప్యూటర్ సైన్స్ -- 15, శ్రీరాంపూర్ సీఈసీ -- 2, ఎంపిహెచ్‌డబ్ల్యూ -- 2, సుల్తానాబాద్ సీఈసీ -- 6. కేజీబీవీల్లో విద్యార్థినులకు ఉచిత వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నాణ్యమైన విద్య వంటి సదుపాయాలు లభిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్నందున అర్హులైన విద్యార్థినులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం:వలస సుభాష్ చంద్రబోస్



**హుస్నాబాద్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్భంగా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని, జూటు బ్యాగులు వంటి సహజ సిద్ధమైన వస్తువులను వినియోగించాలని ఆయన సూచించారు. ప్రతిరోజూ దుకాణాల నుండి ఇంటికి వస్తున్న ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని, వ్యర్థాలను తగ్గించడం ప్రకృతికి ఇచ్చే గొప్ప బహుమతిగా భావించాలని ఆయన అన్నారు. ప్లాస్టిక్ వాడకం ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారని గుర్తు చేశారు. సంకల్ప సంస్థ గత రెండు దశాబ్దాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు, ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, భవిష్యత్తులో కూడా ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించే వరకు ప్రజల్లో అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. ఈ సందేశం ద్వారా ఆయన ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణ, జూటు బ్యాగుల వినియోగం వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం పెంచాలని పిలుపునిచ్చారు.

## శాతవాహనలో ఘనంగా గణిత శాస్త్ర వర్క్‌షాప్




**కరీంనగర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "గణిత శాస్త్ర భావనలు -- సాంకేతికతలు" అంశంపై ఒక రోజు కార్యశాల ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. రమాకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్ కుమార్ ప్రారంభించారు. గణిత శాస్త్రంలో వస్తున్న సరికొత్త మార్పులను అధ్యాపకులు, విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. గౌరవ అతిథి డా. డి. హరికాంత్ మాట్లాడుతూ గణితం నిత్యజీవితంలో భాగమని పేర్కొన్నారు. విభాగాధిపతి డా. కె. ప్రసాద్ వర్క్‌షాప్ ఉద్దేశాలను వివరించారు. కో-కోఆర్డినేటర్ డా. ఎ. రవి కుమార్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సమక్షంలో హరితహారం



**కరీంనగర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ టవర్ ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయ కేంద్రంలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు, పూల మొక్కలు నాటడం జరిగింది. కార్యక్రమంలో గోల్డెన్ టవర్ అధ్యక్షుడు లయన్ రంగురాజు, సెక్రటరీ లయన్ నూనె వీర భాస్కర్, కోశాధికారి లయన్ మండలోజు విజయకుమార్, లయన్ సూర్య శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. అవాస శరణార్థుల కోసం ప్రత్యేకంగా అల్పాహారం మరియు అరటి పండ్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా హరితహారం ప్రాధాన్యతతో పాటు సేవా భావాన్ని ప్రతిబింబించారని నిర్వాహకులు తెలిపారు.

## ఓటరు జాబితా సవరణ సహాయ కేంద్రం ఏర్పాటు




**పెద్దపల్లి, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ( ప్రక్రియలో భాగంగా ఓటర్ల సౌకర్యార్థం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో గంగయ్య తెలిపారు. పట్టణ పరిధిలోని ఓటర్లు తమ ఓటుకు సంబంధించిన వివరాలు, అలాగే బూత్ లెవెల్ అధికారుల సమాచారాన్ని ఈ కేంద్రం ద్వారా తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఓటర్లు తమ ఓటర్ ఐడీ కార్డు లేదా ఎపిక్ నంబర్‌తో సహాయ కేంద్రాన్ని సంప్రదిస్తే సిబ్బంది అవసరమైన పూర్తి సమాచారాన్ని అందిస్తారని వివరించారు. ఈ కేంద్రం ఏర్పాటుకు సహకరించిన మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌కు ఆర్డీవో ధన్యవాదాలు తెలిపారు. పట్టణ ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గంగయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**సుల్తానాబాద్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఓదెల మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఇటీవల కోర్టు భవన యజమాని అద్దె చెల్లించక తాళం వేసిన ఘటన నేపథ్యంలో మండల కేంద్రంలోని నిరుపయోగంగా ఉన్న ఐకెపి భవనాన్ని పునరుద్ధరించి కోర్టు భవనంగా వినియోగించేందుకు అధికారులను ఆదేశించారు. ఓదెలలో నిర్మాణంలో ఉన్న కొత్త ఎమ్మార్వో కార్యాలయాన్ని పరిశీలించి పనుల పురోగతి, నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కొలనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక నిల్వల స్వాధీనం



**కరీంనగర్ రూరల్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక మాఫియాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు శుక్రవారం ఎలగందుల గ్రామంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించి, అక్రమంగా నిల్వ ఉంచిన రెండు భారీ ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో మొత్తం 65 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను పోలీసులు పట్టుకున్నారు. వీటిలో సూతూరి శ్రీనివాస్ వద్ద 40 ట్రిప్పులు, సింది రామ్ సుందర్ వద్ద 25 ట్రిప్పులు ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను కొత్తపల్లి, రామడుగు పోలీసులకు అప్పగించారు. కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకం, నిల్వ, రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని, మైనింగ్ చట్టాలు మరియు ఇతర సంబంధిత చట్టాల ప్రకారం నిబంధనలు ఉల్లంఘించే వారిని కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు.

## మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహణ



**అమ్రాబాద్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మండలంలోని ఎల్మపల్లి గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో రూ.30 లక్షలతో మహిళా సంఘం భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మహిళా సమావేశాలు, ఆర్థిక లావాదేవీలు, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణలకు ఈ భవనాలు శాశ్వత వేదికలుగా ఉపయోగపడతాయని వివరించారు. కుట్టు శిక్షణ, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కార్యక్రమాలు, బ్యాంకు లింకేజీలు, రుణాలపై చర్చలు ఒకే చోట నిర్వహించుకునేందుకు వీటిని వినియోగించవచ్చని చెప్పారు. భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, అధికారులు, స్పెషల్ ఆఫీసర్ చిగుర్ల కోటయ్య, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆకాశం మేఘావృతమై చిరుజల్లుల వర్షంతో తడిసిన నేల

**ఖానాపూర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దిలావర్పూర్, ఎల్లాపూర్, సోమవార్పేట్, సత్తెనపల్లి, తర్లపాడు, మస్కాపూర్, పెద్ద గ్రామాల్లో మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కొనసాగడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులు చిత్తడిగా మారి ప్రయాణానికి ఆటంకం కలిగింది. ఇలాంటి వర్షాకాల పరిస్థితులు స్థానిక ప్రజలకు వాతావరణ ప్రభావం మరియు వ్యాధుల ప్రమాదం పై మరింత జాగ్రత్త అవసరమని అధికారులు సూచిస్తున్నారు.



## బీజేపీ సమక్షంలో ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం

**రాజన్న సిరిసిల్ల, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై సమీక్ష సమావేశం ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అధ్యక్షతన, రాష్ట్ర సర్ కన్వీనర్ గరిపెల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర సర్ కన్వీనర్ ఆంటోనీ రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ జాబితాలో నమోదు అయ్యేలా, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ, బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర సంస్థాగత బలోపేతానికి కీలకమని, రాష్ట్ర పార్టీ ఇచ్చిన లక్ష్యాలను ప్రతి మండలంలో సమర్థవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా సర్ కన్వీనర్ గరిపెల్లి ప్రభాకర్ జిల్లాలో జరుగుతున్న కార్యక్రమ పురోగతిని వివరించి, సమస్యల పరిష్కార మార్గాలపై చర్చించారు. బూత్‌ల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు కుమ్మరి శంకర్,



లింగంపల్లి శంకర్, పొన్నాల తిరుపతి రెడ్డి, సిరికొండ శ్రీనివాస్, శీలం రాజు, బండ మల్లేశం, రాజాసింగ్, రేగుల సంతోష్ బాబు, ఉడుగుల యాదగిరి, కిరణ్ నాయక్, శ్రీమతి వైశాలి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ప్రతి మండలంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో నమోదు చేయాలని నిర్ణయించారు.

## యూనియన్ బ్యాంక్ బీసీ పాయింట్ ప్రారంభం

**జమ్మికుంట , జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొరపల్లి గ్రామంలో యూనియన్ బ్యాంక్ బీసీ (బ్యాంకింగ్ కరెస్పాండెంట్) పాయింట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లపల్లి గ్రామ పంచాయతీ 3వ వార్డు సభ్యుడు బండారి ప్రశాంత్ పాల్గొని, బీసీ పాయింట్ నిర్వాహకురాలు ఈర్ల దివ్య రమేష్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండారి ప్రశాంత్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ చేయడంలో బీసీ పాయింట్లు కీలకమని అన్నారు. వృద్ధులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు గ్రామంలోనే నగదు జమ, ఉపసంహరణ, ఖాతా వివరాలు, ఆధార్ ఆధారిత సేవలు పొందగలరని తెలిపారు. ప్రజలు ఈ సేవలను



సద్వినియోగం చేసుకుని సమయం, ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పరిధిలో పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమం

**ఖానాపూర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాకాలం దృష్ట్యా ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఎనిమిదో వార్డులో కౌన్సిలర్ బొప్పారం సత్యవ్వ జెసిబి సహాయంతో ఏపుగా పెరిగిన చెట్లను తొలగించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ముందు పెరిగిన చిన్న మొక్కలను తొలగించాలని ప్రజలకు సూచించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు, జ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అదే విధంగా రాజీవ్ నగర్ కాలనీ 11వ వార్డులో కౌన్సిలర్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం జెసిబి సహాయంతో మురికి కాలువలు, పిచ్చి మొక్కలను తొలగింప చేయించారు. కాలనీలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు,



స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## క్రిస్టియన్ మైనారిటీలకు దరఖాస్తుల ఆహ్వానం

**కరీంనగర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ 2026--27 ఆర్థిక సంవత్సరానికి పలు పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సెలైయింగ్ మెషిన్, చిన్న వ్యాపారం, ఈ-బైక్, ఈ-స్కూటీ, మోటార్ బైక్ పథకాల కోసం క్రిస్టియన్ మైనారిటీ వర్గానికి చెందిన వారు అర్హులు. కుట్టు మిషన్, చిన్న వ్యాపారం కోసం వయస్సు 21--55 సంవత్సరాలు, ఈ-బైక్, స్కూటీ, మోటార్ బైక్ కోసం 21--50 సంవత్సరాలు ఉండాలి. వార్షిక కుటుంబ ఆదాయం పట్టణ ప్రాంతంలో రూ.2 లక్షల లోపు, గ్రామీణ ప్రాంతంలో రూ.1.5 లక్షల లోపు ఉండాలి. దరఖాస్తుల నమోదు జూలై 3 నుంచి జూలై 18 సాయంత్రం 5 గంటల వరకు వెబ్‌సైట్‌లో చేయవచ్చు. మరిన్ని వివరాల కోసం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ, కరీంనగర్ రూం నెం.108, 1వ ఫ్లోర్‌ను సంప్రదించవచ్చు. సంప్రదించవలసిన నంబర్లు: 08782957085, 9989727382 జిల్లాలోని క్రిస్టియన్ మైనారిటీ వర్గానికి చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జె. స్వామి సూచించారు.

## జిల్లా డీసీసీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఎండి హసన్



**హుస్నాబాద్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఎండి హసన్‌కు పార్టీ అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించింది. సిద్దిపేట జిల్లా డీసీసీ కార్యదర్శిగా ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకంపై హుస్నాబాద్ కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. ఎండి హసన్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. హసన్ బాయ్‌గా ప్రజలకు సుపరిచితుడైన ఆయన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, జిల్లా ఆర్గనైజింగ్ యూత్ సెక్రటరీ, పట్టణ కార్యదర్శి, మైనారిటీ మండల అధ్యక్షుడు, విద్యా కమిటీ చైర్మన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఎంపీటీసీ వంటి పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం హుస్నాబాద్ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. జిల్లా స్థాయి పదవి లభించడంతో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, శ్రేయోభిలాషులు, అఖిలపక్ష నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## కన్స్యూమర్ కోర్టులో న్యాయవాదుల విధుల బహిష్కరణ



**ఖానాపూర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అదిలాబాద్ కన్స్యూమర్ కోర్టులో న్యాయవాదుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, వృత్తి గౌరవాన్ని అవమానించే సంఘటనను ఖండిస్తూ ఖానాపూర్ కోర్టు న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. న్యాయవాదుల గౌరవం, స్వతంత్రత, వృత్తిపరమైన మర్యాదను పరిరక్షించేందుకు ఈ నిరసన చేపట్టినట్లు వారు తెలిపారు. ఇకముందు ఇలాంటి అరాచకాలు జరగకుండా న్యాయవాదులకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో కోర్టు పరిధిలోని పనులు స్తంభించాయి. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు మట్టేరి రాజశేఖర్, సీనియర్ న్యాయవాదులు వెంకట్ మహేంద్ర, వి.వి. రమణ, నూనె గంగాధర్, శ్రీనివాస్, పి. రాజలింగం, జాయింట్ సెక్రటరీ బాశెట్టి శివ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ షబ్బీర్ పాషా, నరేంద్రనాథ్, ఖాజా, ఖదీర్, కమలాకర్, సిలివేరి వేణు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం ఆశా కార్యకర్తలు డ్రైడే పాటించాలి - ఎంపీడీవో రాధా రాథోడ్

ఖానాపూర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మండలంలోని ఎగ్‌బాల్‌పూర్ గ్రామంలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధా రాథోడ్ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం ఆశా కార్యకర్తలు డ్రైడే పాటించాలని సూచించారు. ఒక్కో డ్రైడే రోజున దాదాపు 50 గృహాలను పరిశీలించి వివరాలు నమోదు చేయాలని



తెలిపారు. ఇళ్లలో కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి బొండాలు, తాటి ముంజలు, కాలి సీసాల్లో నిల్వ నీటిని తొలగించాలని, ఇంటి పరిసరాల్లో గుంతలు ఉంటే మట్టి వేయాలని సూచించారు. గుంతల్లో నీరు నిల్వ ఉండటం వలన దోమలు గుడ్లు పెట్టి జ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త చంద్రకళ, జిపి సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగ మారిన రింకొని వాగు రహదారి



**ఖానాపూర్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ పట్టణం నుండి దిలావర్పూర్, తర్లపాడు గ్రామాలకు వెళ్లే రింకొని వాగు వద్ద రహదారి ప్రమాదకరంగా మారిందని మున్సిపల్ వైస్ చైర్మన్ సోయబు హుస్సేన్ ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే వాగుపై నిర్మించిన వంతెన పూర్తిస్థాయిలో నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం తాత్కాలికంగా ఇరువైపులా మట్టి వేసి ప్రయాణం సాగుతున్నా, ఇది ప్రమాదకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారాలకే పరిమితమైందని విమర్శించారు. ఇకనైనా వంతెనను పూర్తి స్థాయిలో నిర్మించాలని వారు కోరారు. ఇలాంటి పరిస్థితులు స్థానిక ప్రజలకు వర్షాకాల రహదారి సమస్యలు మరియు గ్రామీణ మౌలిక వసతులు పై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి.

## సర్కారు బడిపై నమ్మకం చాటిన మాజీ సర్పంచ్




**ఆమనగల్లు, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందనే విశ్వాసంతో మాజీ సర్పంచ్ రామచందర్ తన ముగ్గురు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ప్రవేశోత్సవ కార్యక్రమంలో ఆయన తన పిల్లలను స్వయంగా పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా రామచందర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు, ఆధునిక బోధనా విధానాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, విద్యా సామగ్రి, డిజిటల్ బోధన వంటి సౌకర్యాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలే నాణ్యమైన విద్య అందిస్తాయనే అపోహను తల్లిదండ్రులు వీడాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కూడా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. ప్రతి తల్లిదండ్రి ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్ రామచందర్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ప్రజల్లో ప్రభుత్వ విద్యపై మరింత విశ్వాసం పెంపొందించేందుకు ఇటువంటి నిర్ణయాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు.

## ఓటరు జాబితా సవరణ పనులను పరిశీలించిన సర్పంచ్ కప్పల ప్రవీణ్



ఎన్యూమరేషన్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఉపసర్పంచ్ ముంజం నరేష్

**ఎలిగేడు, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో శుక్రవారం జరిగిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎన్యూమరేషన్ ఫారాలు) పనులను గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బీఎల్‌వోలతో మాట్లాడి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితాలో ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లు లేకుండా సరిచేయాలని సూచించారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి, ఎన్యూమరేషన్ ఫారాల్లో ఖచ్చితంగా నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. ఓటర్ల వివరాల సవరణలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సర్పంచ్ ప్రవీణ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అంజలి, ఉప సర్పంచ్ ముంజం నరేష్ కుమార్, వార్డు సభ్యులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## చెరువు కాలువపై అక్రమ నిర్మాణం కూల్చివేత



**ఆమనగల్లు, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో స్వాతి హాస్పిటల్ వెనుక ఉన్న కాలనీలో చెరువు కాలువపై నిర్మించిన అక్రమ ప్రహరీ గోడను శుక్రవారం మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు కూల్చివేశారు. చెరువు కాలువను ఆక్రమించి నిర్మాణం చేపట్టినట్లు గుర్తించిన అధికారులు మున్సిపల్ నిబంధనల మేరకు ఈ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఎవరూ రోడ్లు, కాలువలు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. గృహ నిర్మాణాలు చేపట్టే ముందు తప్పనిసరిగా మున్సిపాలిటీ నుంచి భవన నిర్మాణ అనుమతులు పొందాలని, నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్‌లు వదిలి మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని తొలగిస్తామని హెచ్చరించారు. పట్టణ ప్రణాళిక నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ రాఘవేందర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.





# నందికొట్కూరులో ఏపీ ఫుడ్ సేఫ్టీ చైర్మన్ ఆకస్మిక తనిఖీ

నందికొట్కూరు, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నందికొట్కూరు, పగిడ్యాల మండలాల్లోని లక్ష్మాపురం అంబేద్కర్ గురుకులం, అంగన్‌వాడీ కేంద్రాలు, కోటా హైస్కూల్, గర్ల్స్ స్కూల్, సివిల్ సప్లై గోడౌన్, మిడుతూరు మండలంలోని పలు కేంద్రాలను ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పేద పిల్లలకు పెట్టే అన్నంలో కక్కుర్తి వద్దు, లంచాలకు ఆశపడొద్దు. వంట నాణ్యతలో లోపాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. గురుకులాల్లో వంట సిబ్బంది ఎదుర్కొంటున్న జీతాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, "అవసరానికి మించి బియ్యం స్టాక్ ఉంచడం వల్ల పురుగు పడుతోంది. ఎంత అవసరమో అంతే స్టాక్ తీసుకోవాలి. రేషన్ షాపులు, హాస్టళ్లు, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీలు అన్నీ ఫుడ్ కమిషన్ పరిధిలోకి వస్తాయి. లోపాలు జరిగితే సుమోటో కేసులు పెట్టే, ఫైన్లు వేసే, సస్పెండ్ చేసే అధికారాలు కమిషన్‌కు ఉన్నాయి" అని వివరించారు. నందికొట్కూరు మండలంలో ఎంఈఓలు నిర్లక్ష్యం చేస్తే పిల్లల జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మంగవల్లి, ఎమ్మార్వో శ్రీనివాసులు, ఫుడ్ సేఫ్టీ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## మెకానిక్‌ల సేవలు సమాజానికి ఎంతో విలువైనవి :పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచ మెకానిక్స్ డే సందర్భంగా శుక్రవారం పట్టణంలోని అయ్యప్ప కొండ ఆవరణలో ఆమనగల్లు టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంఘసేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము, శ్రీరామ ఆటో మొబైల్ సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టూ వీలర్ మెకానిక్ సృష్టికర్త గాట్లీబ్ డైమ్లర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అసోసియేషన్ సభ్యులకు తినిపించి ప్రపంచ మెకానిక్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ మెకానిక్‌లు సమాజానికి అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని అన్నారు. ప్రజల దైనందిన జీవితంలో వాహనాల నిర్వహణలో మెకానిక్‌ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎండనక, వాననక కష్టపడి పనిచేస్తూ ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్న మెకానిక్‌ల సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. ప్రభుత్వం మెకానిక్‌ల సంక్షేమానికి మరింత ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. మెకానిక్ వృత్తి గౌరవప్రదమైనదని, యువత నైపుణ్యాలను పెంపొందించుకుని ఈ రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యక్షులు పర్వతాలు, ఉపాధ్యక్షులు రాఘవేందర్, కోశాధికారి శ్రీను, గౌరవ అధ్యక్షులు కృష్ణ, నరసింహ, కొండల్, లక్ష్మణ్, మల్లేష్, సత్యం, జంగయ్య, శ్రీను, వెంకటేష్, రవి, మల్లేష్, మహేష్, రాజు, విజేందర్, శ్రీను, రాజు, విక్రమ్ శివ, నర్సింహా ఉన్నారు.

## ఎమ్మెల్యే జన్మదినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం



-కొండమల్లేపల్లి మండలం కేంద్రంలో రక్తదాన శిబిరం.

**దేవరకొండ జూలై 03. (నీలగిరి ఎక్స్ ప్రెస్):** దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత, ప్రజల అభిమాన నాయకులు, ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని, కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఘనంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సతీమణి నేనావత్ జ్యోతి ప్రసన్న బాలు నాయక్ , యువజన నాయకులు నేనావత్ దేవరన్ నాయక్ హాజరై రక్తదాతలను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రక్తదానం మహాదానమని, ఒక వ్యక్తి చేసిన రక్తదానం అనేకమంది ప్రాణాలను కాపాడే గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. యువత సేవా భావంతో ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో పెద్దఎత్తున పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం అభినందనీయమని వారు తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే బాలు నాయక్ గారి ఆశయాలకు అనుగుణంగా యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం సంతోషకరమని అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో పెద్ద సంఖ్యలో యువకులు, విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఎన్ ఎస్ యుఐనాయకులు, వైద్య సిబ్బంది, రక్తదాతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా బొమ్మక్ కళ్యాణ్ నియామకం



**బోడుప్పల్, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా 12వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బొమ్మక్ కళ్యాణ్ మాట్లాడుతూ, "2014లో మా తండ్రి బొమ్మక్ గోపీనాథ్ ఉప సర్పంచ్‌గా బోడుప్పల్ ప్రజలకు ఎనలేని సేవలు అందించారు. ఆయనపై ఉన్న ప్రేమాభిమానంతోనే ప్రజలు నన్ను కార్పొరేటర్‌గా గెలిపించారు. నా డివిజన్ ప్రజలకు సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు పూర్తిస్థాయిలో సమకూర్చాను. నాపై నమ్మకంతో బోడుప్పల్ డివిజన్ అధ్యక్షునిగా నియమించిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్ బాబుకి ప్రత్యేక ధన్యవాదాలు" అని తెలిపారు.

## పోతేపల్లిలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**వెల్దండ, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల పరిధిలోని పోతేపల్లి గ్రామంలో కామినేని ఆసుపత్రి వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి, గ్రామ సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ సాత్విక ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి సుమారు 220 మంది గ్రామ ప్రజలు హాజరయ్యారు. ఇందులో భాగంగా వివిధ ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కొండల్ యాదవ్ మాట్లాడుతూ, "గ్రామ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలి" అని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామినేని ఆసుపత్రి సీనియర్ ఎగ్జిక్యూటివ్ కే. దేవేందర్ రావు, ఉప సర్పంచ్ శారద బాలయ్య గౌడ్, వార్డు సభ్యులు అశోక్ కుమార్, యూ. బాలు, వావిళ్ళ కొండల్ యాదవ్, ఉడుత శివ యాదవ్, ఆ. శివ కుమార్, దగ్గర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# నల్లగొండలో జమీయత్ ఉలేమా-ఏ-హింద్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ అవగాహన సదస్సు




**నల్లగొండ, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ జిల్లా జమీయత్ ఉలేమా-ఏ-హింద్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి 9 గంటలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై ముస్లిం మైనార్టీలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా ఫారమ్ ఎలా నింపాలి, ఏ పత్రాలు అవసరం, ప్రజల్లో నెలకొన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేయడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి జమీయత్ ఉలేమా-ఏ-హింద్ జిల్లా అధ్యక్షులు మౌలానా అబ్దుల్ బషీర్ సహాబ్ అధ్యక్షత వహించగా, నల్లగొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మొహమ్మద్ అష్రఫ్ అలీ (అమీర్), మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ (ఎలక్షన్) ఆజమ్ ఖాన్, ఎంఆర్వో కొట్టపల్లి పర్శురాం, ఖాజీ ఇక్రముల్లా తదితరులు పాల్గొన్నారు. ఆర్డీవో అశోక్ రెడ్డి మాట్లాడుతూ, "ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో అనవసర భయాలు అవసరం లేదు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సరైన వివరాలు, అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును పరిరక్షించుకోవాలి" అని సూచించారు. మౌలానా అబ్దుల్ బషీర్ సహాబ్ మాట్లాడుతూ, "ముస్లిం మైనార్టీలు వదంతులను నమ్మకుండా అధికారుల సూచనలను పాటించాలి. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన సందేహాలను నేరుగా అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీలు, ప్రజాప్రతినిధులు, సామాజిక ప్రముఖులు పాల్గొని ఎస్ఐఆర్ ప్రక్రియపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## జూలై 10 విద్యార్థి బంద్‌కు పిలుపు



వెల్దండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్యు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ, "ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారు. అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న విద్యార్థి బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలకు పిలుపునిచ్చారు.

## జూలై 10 విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు



**కల్వకుర్తి, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్యు ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించి, జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు మాట్లాడుతూ, "ప్రభుత్వ విద్యాసంస్థల్లో అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల లేమి, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడీతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఒత్తిడి తీసుకురావడానికే బంద్ నిర్వహిస్తున్నాం" అని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రామార్జున్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు కార్తీక్, విద్యార్థి నాయకులు సాయి కిరణ్, మహేష్, అఖిల్, రమేష్ పాల్గొని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి ఎమ్మెల్యేను ఆహ్వానించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలంలో జూలై 4న జరగనున్న ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజల ఆరోగ్య రక్షణకై ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నాం. ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించాలి" అని కోరారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించి, "ప్రజలకు ఉపయోగపడే ఈ కార్యక్రమం విజయవంతం కావాలి" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మాజీ పిసీసీ సభ్యులు ఐల్ల శ్రీనివాస్ గౌడ్, బీసీసీ ఉపాధ్యక్షులు ఎన్నం భూపతి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్ కుమార్ రెడ్డి, యాట నరసింహ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్, సీనియర్ నాయకులు సురభి వెంకటేశ్వరరావు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై కక్షపూరితంగానే భద్రత తొలగించారని ఆరోపణ



**కల్వకుర్తి, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భద్రతను కక్షపూరితంగానే తొలగించారని బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ అధ్యక్షుడు వట్టేపు కిషోర్ ఆరోపించారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "ప్రవీణ్‌కుమార్ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలపై గళమెత్తి, ప్రభుత్వ అవినీతిని ఎండగడుతున్నారు. అందుకే రాజకీయ కక్షతో ఆయనకు ఇచ్చిన బుల్లెట్‌ప్రూఫ్ కార్, భద్రతా సిబ్బందిని తొలగించారు" అని అన్నారు. అదేవిధంగా, "ప్రవీణ్‌కుమార్ సతీమణి లక్ష్మీబాయి 20 ఏళ్లుగా వ్యవసాయ శాఖలో పనిచేస్తున్నారు. రిటైర్మెంట్‌కు ఏడాది మాత్రమే మిగిలి ఉండగా కావాలని వేరే శాఖకు బదిలీ చేయడం జరిగింది. ఇది కుటుంబంపై కక్ష సాధింపు చర్య" అని విమర్శించారు. "ఒక దళిత విద్యావేత్తగా లక్షలాది విద్యార్థులకు గురుకులాల ద్వారా వెలుగులు నింపిన ప్రవీణ్‌కుమార్ పై ఇలా చేయడం సబబు కాదు. రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకపోతే కుటుంబంపై కక్ష సాధించడం తగదు. ఇలాంటి చర్యలు కొనసాగితే రాష్ట్రం అగ్నిగుండం అవుతుంది" అని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల బీఆర్ఎస్ నాయకులు ముత్యాల రమేష్, వార్డు సభ్యులు నరేష్, ఎస్సి సెల్ మండల కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు జోగు విష్ణు, యువ నాయకులు వట్టేపు గణేష్, విష్ణు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## జైపాల్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన గోలి

**ఆమనగల్లు, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జైపాల్ రెడ్డి తల్లి ఎమిరెడ్డి పెద్ద లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం వారి నివాసానికి చేరుకుని దివంగతురాలి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జైపాల్ రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దివంగత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన ఆయన, ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల పీఏసీఎస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, మాజీ సర్పంచులు కృష్ణారెడ్డి, యాదిరెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు లాలయ్య, అవురుపల్లి సర్పంచ్ పోశయ్య, వార్డు సభ్యులు యాదయ్య, కొండల్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొని దివంగతురాలికి ఘన నివాళులర్పించారు.



## 100వ రోజు కొనసాగిన 98 జీవో బాధితుల రిలే దీక్ష



**నందికొట్కూరు, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీశైలం ముంపు బాధితులు నందికొట్కూరు పట్టణంలో 100 రోజులుగా రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్నప్పటికీ నేతలు పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు శుక్రవారం రిలే ర్యాలీ నిర్వహించి, "ఇలా నిర్లక్ష్యం చేస్తే మాకు ఆత్మహత్యలే శరణ్యం అవుతాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ర్యాలీకి వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి డాక్టర్ దారా సుధీర్ సుంకులమ్మ గుడి వద్ద నుండి పటేల్ సెంటర్ వరకు పాల్గొని బాధితులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నాయకుడు దారా సుధీర్, రాయలసీమ నీటి సంఘం అధ్యక్షుడు దశరథి రామిరెడ్డి మాట్లాడుతూ, "జీవో 98 ప్రకారం మిగిలిన 674 మందికి ఉద్యోగాలు కల్పించాలి. లేనిపక్షంలో వైఎస్సార్సీపీ ఆమరణ నిరాహార దీక్ష చేపడుతుంది" అని హెచ్చరించారు. సీపీఎం, సీపీఐ, బీఎస్పీ పార్టీలు ఈ ఆందోళనకు మద్దతు ప్రకటించాయి.

## తొలకరి జల్లులు... రైతుల్లో కొత్త ఆశలు



**ఎలిగేడు, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రుతుపవనాల ప్రభావంతో శుక్రవారం ఎలిగేడు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో తొలకరి జల్లులు కురిశాయి. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇటీవలి వేడి గాలులు, ఉక్కపోతతో ఆందోళనలో ఉన్న అన్నదాతలు వర్షాలు పడకపోవడంతో నిరాశ చెందగా, ఈ చిరుజల్లులు పంటల సాగుపై కొత్త ఆశలు చిగురింపజేశాయి. రైతులు పొలాల్లోకి అడుగుపెట్టి సాగు పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. మండల పరిధిలోని రైతులు చెరువులు, కుంటలు, వ్యవసాయ బావులపై ఆధారపడి వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలను సాగు చేస్తూ ఉంటారు. ఈ తొలకరి వర్షాలు పంటల పెరుగుదలకు తోడ్పడతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పంజుగులలో కొనసాగుతున్న ఎస్ఆర్ఐ ప్రక్రియ..



**కల్వకుర్తి, జులై 03(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కల్వకుర్తి మండల పరిధిలోని పంజుగుల గ్రామంలో ఎస్ఆర్ఐ ప్రక్రియలో శుక్రవారం గ్రామంలో డిఎల్ఓ అశోక్ ఇంటింటా తిరుగుతూ అప్లికేషన్ ఫారాన్ని పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో దారమోని గణేష్ ,శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకులు నారోజు కుమారస్వామి

**హస్తినాపురం , జూలై 3 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** హస్తినాపురం జెడ్ పి రోడ్ లో కాకతీయ కాలనీలో బి ఆర్ ఎస్ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు ఆందోజు సత్యం చారి గారి నూతన గృహప్రవేశానికి అతిధిగా నారోజు కుమారస్వామి బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకులు కుటుంబ సమేతంగా పాల్గొని జ్ఞాపికని అందజేశారు.



## కల్వకుర్తిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని సదానందం గౌడ్ విజ్ఞప్తి

**కల్వకుర్తి, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి నియోజకవర్గాన్ని 15 మండలాలతో కూడిన జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమనేత, కల్వకుర్తి జేఏసీ చైర్మన్ డాక్టర్ అయిల్ సదానందం గౌడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సదానందం గౌడ్ మాట్లాడుతూ, "కల్వకుర్తి ప్రాంతం చరిత్ర, సాంస్కృతిక వైభవం, ఉద్యమాల పునాది. స్వాతంత్ర్య పోరాటాలు, రైతాంగ ఉద్యమాలు, తెలంగాణ విద్యార్థి ఉద్యమం, కరువు వ్యతిరేక పోరాటాలు, కేఎల్ఐ నీళ్ల పోరాటం వంటి అనేక ఉద్యమాలకు కేంద్రంగా నిలిచింది. విద్య, వైద్యం, వ్యవసాయం, రియల్ ఎస్టేట్ రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది" అని వివరించారు. జిల్లా కావలసిన లక్షణాలు కల్వకుర్తిలో ఉన్నాయని, కల్వకుర్తి, వెల్దండ, ఆమనగల్, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల్, వంగూరు, చారగొండ, మిడ్జిల్, ఉర్కొండ, ఉకేశంపేట్, వెల్జాల్, రఘుపతిపేట, ఇర్విన్, డిండి మండలాలను కలిపి 15 మండలాలతో జిల్లా ఏర్పాటు చేయాలని సూచించారు. "మూడు జాతీయ రహదారులు కలిసే కూడలిగా కల్వకుర్తి ఉంది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం, తిరుపతి, కోదాడ--రాయచూరు మార్గాలను కలిపే కేంద్రంగా ఇది వెలసింది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. భవిష్యత్తులో విద్య, వైద్యం, వాణిజ్య రంగాల్లో కల్వకుర్తి మరింత అభివృద్ధి చెందుతుంది" అని ఆశాభావం వ్యక్తం చేశారు. సదానందం గౌడ్ విజ్ఞప్తి చేస్తూ, "గతంలో 6, 7, 8 మండలాలతో జిల్లాలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు 15 మండలాలతో కల్వకుర్తిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడం న్యాయబద్ధమైన కోరిక. ప్రజలందరి అభిలాషను నెరవేర్చాలని" ముఖ్యమంత్రిని కోరారు.



నీలగిరి ఎక్స్‌ప్రెస్
RNI - TELTEL/2023/87644
తెలుగు దినపత్రిక



## ఏపీ సీఎం నిర్ణయం చరిత్రాత్మకమైనది



**కర్నూల్, జూలై 3(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏపీ సీఎం నారా చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 లోని షెడ్యూల్ 6 మరియు కిందకు వచ్చే ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీలలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుండి 62 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక ఉత్తర్వులు (జి.ఓ. ఎంఎస్.నెం-45) జారీ చేయడం పట్ల ఏపీ ఈడబ్ల్యూఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ జి.నాగముని డైరెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది ఉద్యోగుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు మరియు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. విద్యాశాఖ మరియు దాని అనుబంధ సొసైటీలలోని, ఉద్యోగులందరి తరపున ప్రభుత్వానికి హృదయపూర్వక అభినందనలు, ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎస్ఐఆర్ కీలక అంశాలపై సమీక్ష





**నందికొట్కూరు, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పగిడ్యాల మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో, వారి నివాసంలో నిర్వహించిన సమావేశంలో నందికొట్కూరు వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి డాక్టర్ దారా సుధీర్ బూత్ లెవెల్ ఏజెంట్లతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై అవగాహన, సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఓటరు జాబితాల ప్రక్షాళన, అర్హులైన ఓటర్ల నమోదు, నకిలీ ఓటర్ల తొలగింపు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత" వంటి కీలక అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం పెట్టాలి.



**ఎలిగేడు, జూలై 3(నీలగిరి ఎక్స్ ప్రెస్):** పాఠశాలలో ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్నభోజనం పెట్టాలని సర్పంచ్ మద్దెల రమాదేవి-సంపత్ అన్నారు. శుక్రవారం ఎలిగేడు మండలంలోని ర్యాకల్దేవుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పరిశీలించారు. ఈసంధర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన తీరును పరిశీలించి, కోడి గుడ్డును తప్పనిసరిగా అందించాలని భోజన నిర్వాహకులకు సూచించారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల సంఖ్య,హాజరు వంటివి అడిగి తెలుసుకున్నారు.

## సంకటోనిపల్లి బూత్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన

**ఆమనగల్లు, జూలై 3 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ 8వ వార్డు సంకటోనిపల్లిలోని 196వ పోలింగ్ బూత్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఏ దేవరశెట్టి మహేష్, బీఎల్‌ఓ చంద్రకళ, కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏ ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, అవసరమైన పత్రాల పరిశీలన తదితర అంశాలను వారు పరిశీలించారు. అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకుని ఓటరు జాబితాలో తమ వివరాలను సరిచేసుకోవాలని, కొత్తగా అర్హత పొందిన వారు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కల్వకుర్తిలో ఉత్తమ్ పర్యటన.. స్వాగతం నుంచి శుభాకాంక్షల వరకు





**ఆమనగల్లు, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం కల్వకుర్తి నియోజకవర్గంలో పర్యటించారు. ఉదయం ముచ్చర్ల ఫ్యూచర్ సిటీ పరిధిలోని హెలిప్యాడ్‌కు చేరుకున్న మంత్రికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి నియోజకవర్గంలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం హెలిప్యాడ్ వద్దనే నియోజకవర్గంలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంత్రికి వివరించారు. ప్రజలకు ఉపయోగపడే పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఇరువురు సంక్షిప్తంగా చర్చించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కడ్తాల పట్టణానికి చేరుకుని స్థానిక ఎస్ఎల్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన వివాహ వేడుకలో పాల్గొన్నారు. కళ్యాణ వేదికపై నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివాహానికి హాజరైన పెళ్లి పెద్దలు, బంధుమిత్రులు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయంగా ముచ్చటించారు. కార్యక్రమంలో పిరమిడ్ సభ్యులు భాస్కర్ రెడ్డి, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిచ్య నాయక్, సర్పంచ్ ప్రేమ జోహార్లాల్ నాయక్, మాజీ సర్పంచ్ శంకర్, మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మిడ్జిల్ మహాసభకు భారీగా తరలిరావాలి

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ పిలుపు**



**ఆమనగల్లు, జూలై 3 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం విజయవంతంగా 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం మిడ్జిల్‌లో నిర్వహించనున్న మహా విజయోత్సవ బహిరంగ సభను చారిత్రాత్మక విజయంగా నిలపాలని టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమనగల్లు మండల కేంద్రంలో డీసీసీ ఉపాధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా ముదిరాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చేగురి వెంకటేష్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ, తొలిసారిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిడ్జిల్‌కు విచ్చేస్తున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న ఈ సభను కాంగ్రెస్ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజనులు, మహిళలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే వేదికగా ఈ సభ నిలవాలని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా ముదిరాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చేగురి వెంకటేష్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, ఇమ్రాన్ బాబా, మల్లయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాత కమిటీలకు కొనసాగింపు.. తలకొండపల్లిలో మార్పు





**ఆమనగల్లు, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీలకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) శుక్రవారం కొనసాగింపు ఇచ్చింది. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి ప్రతిపాదనల మేరకు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. పాత కమిటీలను యథాతథంగా కొనసాగిస్తూ తలకొండపల్లి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డిని నూతనంగా నియమించారు. ఉత్తర్వుల ప్రకారం కడ్తాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బిచ్య నాయక్, మాడ్గుల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కిషన్ రెడ్డి, తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మనయ్య, ఆమనగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా జగన్, వెల్దండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా హరికిషన్, కల్వకుర్తి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పుస్తకాల రాహుల్, కల్వకుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాల్ రెడ్డిలు కొనసాగనున్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. ఈ ఉత్తర్వులతో కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

## అప్రమత్తమైన అధికారులు - విద్యార్థి సంఘాలు

**సార్ వస్తే సూపర్ ఫుడ్... లేకుంటే నీళ్ల చారు.**



**నందికొట్కూరు, జూలై 3( నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ రాక ముందస్తు సమాచారం తెలిసి అధికారులు వంట ఏజెన్సీలు ఎస్సీ, బీసీ హాస్టల్ వార్డెన్స్ అప్రమత్తమై విద్యార్థిని విద్యార్థులకు పాఠశాలల్లో హాస్టల్లో మంచి భోజనం వడ్డించారని విద్యార్థి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శుక్రవారం సుడిగాలి పర్యటన చేయడంతో నియోజకవర్గంలోని మండల స్థాయి అధికారులు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు హాస్టల్ వార్డెన్లు, అంగన్వాడి, వంట ఏజెన్సీలు అప్రమత్తమై ముందు జాగ్రత్తగా విద్యార్థులకు మంచి భోజనం వడ్డించారని వారు తెలిపారు. "సార్ వస్తారంటే నే మంచి భోజనం "లేదంటే నీళ్ల చా రుతో మధ్యాహ్నం భోజనం వడ్డించే వంట ఏజెన్సీలు ప్రతినిత్యం విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం వడ్డించడం అనేది లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆ సంఘాల నాయకులు దక్క కుమార్, బి శేఖర నాయుడు, నాగరాజు లు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాపరెడ్డి పర్యటన పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో స్థానిక మండల స్థాయి అధికారులు,పాఠశాలలు వంట ఏజెన్సీలు, హాస్టల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలు వడ్డించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కేవలం ప్రభుత్వం ఇచ్చే బెల్ అండ్ బిల్ విధానం( జీతభత్యాలు కాకుండా )అధికారులు ప్రతినిత్యం క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి ప్రభుత్వం ప్రజాధనంతో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం తో పాటు హాస్టల్లో కూడా విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించే విధంగా చర్యలు తీసుకుంటారని వారు కోరుతున్నారు.

## నిరుపేద కుటుంబానికి ఇంటి నిర్మాణానికి సిమెంట్ సాయం



**ఆమనగల్లు, జూలై 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ 6వ వార్డు గుర్రంగుట్టకు చెందిన బిట్టి యాదమ్మ (తండ్రి ఎల్లయ్య) కుటుంబానికి ఇంటి నిర్మాణం పూర్తి చేసేందుకు మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, కౌన్సిలర్ నాగిళ్ల జగన్ చొరవతో శుక్రవారం సిమెంట్ అందజేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు గృహ నిర్మాణ సహాయం అందించే కార్యక్రమంలో భాగంగా ఈ సాయాన్ని అందించారు. ఇంటి నిర్మాణంలో చివరి దశలో ఉన్న ఫినిషింగ్ పనులు పూర్తయ్యేలా సిమెంట్ అందించడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ ఉప్పల వెంకటేష్, కౌన్సిలర్ నాగిళ్ల జగన్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సేవలను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగిళ్ల జగన్, ట్రస్ట్ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## రచ్చబండ పునర్నిర్మాణానికి అధికారులకు వినతి



**ఆమనగల్లు, జూలై 3:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన "సేవ్ రచ్చబండ" కార్యక్రమంలో భాగంగా, గతంలో ఉన్న ప్రదేశంలోనే రచ్చబండను తిరిగి నిర్మించాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లండం చిన్న జంగయ్య మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా రచ్చబండను యథాస్థానంలో పునర్నిర్మించాలని ఆయన అధికారులను కోరారు. ఈ సందర్భంగా అధికారులు వినతిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ కోఆర్డినేటర్ లండం యాదయ్య, ప్రధాన కార్యదర్శి మీసాల రమేష్, నాగిళ్ల లక్ష్మణ్, కల్చరల్ యాక్టివిటీస్ ఇన్‌చార్జి ప్రభు శంకర్, యూత్ కోఆర్డినేటర్ గుజ్జరి గోపి తదితరులు పాల్గొన్నారు.